# నేటి నుంచి జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

## నల్లగొండలోని డాన్‌బాస్కో పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి

రామగిరి, జనవరి 2 : విద్యార్థుల శాస్త్రీయ నైపుణ్యాలను ప్రదర్శించే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు వేళయ్యింది. శుక్ర, శనివారం జరిగే సైన్స్‌ఫెయిర్‌కు నల్లగొండలోని సాగర్‌రోడ్డులో గల డాన్‌బాస్కో పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. 'సుస్థిర అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర ' అనే ప్రధాన అంశంతో జరిగే కార్యక్రమంలో 7 ఉప అంశాలలో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలతోపాటు డీఈడీ, బీఈడీ కళాశాలల ఛాత్రోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ ప్రాజెక్టులు, బోధనోపకరణాలను ప్రదర్శించనున్నారు. వీటితోపాటు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్‌స్పైర్ మనక్ 113 ప్రాజెక్టులను కూడా ప్రదర్శించనున్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు తదితరులు హాజరుకానున్నారు. సైన్స్ ఫెయిర్‌కు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులకు అన్ని వసతులు కల్పించారు. ప్రదర్శన రిజిస్ట్రేషన్ సమయంలోనే అల్పాహారం, భోజన టోకెన్లతో పాటు ఐడీ కార్డులను అందజేస్తారు.

నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 3 జనవరి 2025 | YADADRI BHUVANAGIRI



బస్సులు లేక వెలవెలబోతున్న యాదగిరిగుట్ట పాత బస్టాండ్

# పండుగ పూట ప్రయాణం కష్టమే..!

## జిల్లాలో అరకొరగా ఆర్టీసీ బస్సులు

**మహా లక్ష్మి పథకంతో పెరిగిన మహిళా ప్రయాణికుల సంఖ్య**

**ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా లేని బస్సులు.. డ్రైవర్ల కొరత**

**యాదగిరిగుట్ట డిపోలో ప్రస్తుతం నడుస్తున్నవి 98 బస్సులే..**

**ఇప్పటికే చాలా గ్రామాలు, పట్టణాలకు బస్సులు బంద్**

**కొత్త బస్సులు, డ్రైవర్లకు ప్రతిపాదనలు పంపినా ఫలితం లేదు**

రాబోయే సంక్రాంతి పండుగకు ఆర్టీసీ బస్సు ప్రయాణం అరకొరగానే ఉండనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళల ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంతో ఆదరణ పెరిగినా అందుకనుగుణంగా బస్సులు, డ్రైవర్ల ఏర్పాటులో ప్రభుత్వం విఫలమైంది. దీంతో సంక్రాంతి పండుగకు ఆర్టీసీ బస్సు ప్రయాణం కష్టంగా కనిపిస్తున్నది. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో పరిధిలో ఇప్పటికే పలు రూట్లకు పూర్తిగా బస్సులను నిలిపివేశారు. ఆయా గ్రామాల ప్రజలు తమకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకొస్తున్నా ఆర్టీసీ అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొన్నది. గుట్ట డిపో పరిధిలో 102 ఆర్టీసీ బస్సులుండగా అందులో 98 మాత్రమే పూర్తి స్థాయిలో నడిపిస్తున్నారు.

– యాదగిరిగుట్ట, జనవరి 2

### కొత్త బస్సులు, డ్రైవర్లకు ప్రతిపాదనలు

గత ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ సర్కారులో ఎక్కువ శాతం రూట్లలో ఆర్టీసీ బస్సులు కనుమరుగయ్యాయి. కొన్ని మండల కేంద్రాలతో పాటు మారుమూల గ్రామాల్లో ఆర్టీసీ బస్సు కనిపించడం లేదు. ఆర్టీసీ బస్సులు, డ్రైవర్ల సంఖ్య తగ్గడంతో ఆర్టీసీ అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. ప్రస్తుతం ఉన్న 98 ఆర్టీసీ బస్సులతోపాటు అదనంగా 26 నూతన బస్సులు కావాలని, మరో 25 మంది డ్రైవర్లు అవసరముందని ప్రతిపాదనలు పంపామని, అవి వస్తే తప్ప మిగతా రూట్లలో బస్సులను నడిపించే పరిస్థితి లేదని డిపో మేనేజర్ బందారపు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కానీ ప్రభుత్వం ఇప్పటికీ స్పందించ లేదని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ప్రభుత్వం అందుకనుగణంగా బస్సులు, డ్రైవర్లను సైతం నియమించాలని ప్రయాణికుల నుంచి డిమాండ్ ఉంది.

### తగ్గిన అద్దె బస్సులు..

గత ప్రభుత్వ హయాంలో యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో పరిధిలో 124 బస్సులు ఉండేవి. ఇందులో 55 ప్రైవేట్ అద్దె బస్సులు కాగా మిగతా 69 ఆర్టీసీ బస్సులు. ఈ బస్సులను ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్, తిరుమలగిరితోపాటు ప్రధాన పట్టణాలకు నడుపుతున్నారు. ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచారు. కానీ ప్రభుత్వం మారడంతో ఆర్టీసీ అందజేసే అద్దె తమకు గిట్టుబాటు కావడం లేదని, గత కొన్ని నెలలుగా సుమారు 26 ప్రైవేట్ అద్దె బస్సులు తమ టెండర్ విరమించుకుని నడుపడం లేదు. దీంతో 29 ప్రైవేట్ అద్దె బస్సులు, 69 ఆర్టీసీ బస్సులు కలిపి యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో కేవలం 98 బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. 2023 కంటే ముందు, కొవిడ్ సమయంలో సైతం ఆర్టీసీ బస్సులు ప్రతి గ్రామానికీ వెళ్లేవి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ సౌకర్యాలకు కొదవ లేకుండా ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ప్రారంభించడంతో రద్దీ పెరిగింది. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో రోజుకు రూ. 20 లక్షల ఆదాయం రాగా అందులో మహాలక్ష్మి పథకం కింద రూ. 11 లక్షలు వస్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ల కొరతతో పాటు బస్సులు సంఖ్య తక్కువగా ఉండటంతో ఆర్టీసీ అధికారులు చేతులెత్తేశారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ప్రజలు తమ స్వగ్రామాలకు వస్తుంటారు. ఉచితంగా బస్సు ప్రయాణం కావడంతో ముఖ్యంగా మహిళలు ఆర్టీసీ బస్సు ప్రయాణం తప్పనిసరిగా చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 50 శాతం రూట్లలో ఆర్టీసీ బస్సులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక పండుగ వేళ పరిస్థితిని ఊహించుకుంటేనే ఇక అంతే సంగతులు.

# ప్రభుత్వంపై పోరుబాట



## డిమాండ్ల సాధన కోసం సమ్మెలు

**మూడు వారాలు దాటిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె**

**దశల వారీ పోరాటంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు**

**సమ్మెలోకి గ్రామపంచాయతీ కార్మికులు.**

**ధరల పెంపు కోసం సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె**

**ప్రభుత్వం స్పందించాలని డిమాండ్లు**

## హామీల అమలు కోసం ఆందోళనలు

**కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అటకెక్కుతుండడంతో రేవంత్‌రెడ్డి సర్కారుపై క్రమంగా భ్రమలు తొలిగిపోతున్నాయి. దాంతో ఆయా వర్గాలన్నీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళన బాట పడుతున్నాయి. అధికారం చేపట్టి ఏడాది పాలన పూర్తి చేసుకున్నా నేటికీ తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడుతున్నాయి. ఇప్పటికే అనేక వేదికలపై ప్రభుత్వ పెద్దలు, మంత్రులు, అధికారులకు తమ సమస్యల పరిష్కారం కోసం విన్నవించి అలిసిపోయాయి. ఇక గత్యంతరం లేక రోజుకో వర్గం ప్రభుత్వంపై తిరుగుబావుటా ఎగురవేస్తూ పోరుబాట పడుతున్నాయి. ఇప్పటికే విద్యా శాఖ సమగ్ర శిక్షా ఉద్యోగులు 24రోజులుగా విధులు బహిష్కరించి సమ్మెలో ఉంటున్నారు. వారి ఆందోళనతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. మరోవైపు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు సైతం దశల వారీ ఆందోళనల అనంతరం సమ్మె నోటీసు ఇచ్చి పోరుబాటలో ఉన్నారు. తాజాగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టారు. పెండింగ్ వేతనాలతోపాటు మల్టీపర్పస్ విధానం రద్దు తదితర డిమాండ్లతో 4 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. ఇక జిల్లా పరిధిలోని సివిల్ సప్లయ్ హమీలు తమ కూలీ రేట్లను సవరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నారు. ఇలా వివిధ వర్గాలు ఆందోళన బాట పట్టడంతో ఆయా శాఖల్లో విధులకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. విద్యార్థుల చదువులు, గ్రామాల్లో పారిశుధ్య పనులు గాలికి వదిలేసిన పరిస్థితులు నెలకొన్నాయి.**

– నల్లగొండ ప్రతినిధి, జనవరి 2 (నమస్తే తెలంగాణ)


భువనగిరి పట్టణంలోని వినాయక చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

## దశల వారీగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల పోరాటం..

మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయినా స్పందన కరువవడంతో డిమాండ్ల సాధన కోసం విద్యాశాఖ కమిషనర్, మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్‌కు నవంబర్ 22న ఒకసారి, డిసెంబర్ 10 మరోసారి వేర్వేరుగా ప్రోగ్రెసిస్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(పీఎంటీఏ-టీఎస్) ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ దశల వారీ ఆందోళనలకు సిద్ధమయ్యారు. గత డిసెంబర్ 12 నుంచి వీరి ఆందోళన కొనసాగుతున్నది. ఈ నెల 4న మహా ధర్నాకు సిద్ధమయ్యారు.

**నిరసన కార్యక్రమాలు ఇలా..**

- డిసెంబర్ 12 నుంచి 17 వరకు నల్ల బ్యాడ్జీల ధరించి భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు.
- 18న మండల స్థాయి అ ధికారులకు వినతి పత్రాలు అందించారు.
- 19, 20న ప్లకార్డులతో నిరసన డీఈఓ, డీఐఈఓలకు వినతిపత్రాలు
- 21, 22, 23న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు వినతిపత్రాలు
- 28న కలెక్టరేట్ ఎదుట దీక్ష.. కలెక్టర్‌కు వినతి పత్రం
- ఈ నెల 4న హైదరాబాద్‌లోని ఇందిర పార్కు వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు.

## 24వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

విద్యా శాఖ సమగ్ర శిక్షా ఉద్యోగులు 2023 సెప్టెంబర్ 13న తమ డిమాండ్ల కోసం దీక్షలు చేస్తుండగా అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి వరంగల్‌లోని దీక్ష శిబిరం వద్దకు వెళ్లి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే.. అధికారంలోకి రాగానే చాయ్ తాగినంత సమయంలో మీ సమస్యలు పరిష్కారించడంతోపాటు రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం ఇచ్చిన హామీలపై ఏడాది కాలంగా ఎదురుచూసిన సమగ్ర శిక్షా ఉద్యోగులు ఓపిక నశించి పోరు బాట పట్టారు. విధులను బహిష్కరించి 24 రోజులుగా సమ్మె చేస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, ఎమ్మెల్యేలు, అధికారులకు తమ గోడు విన్నవించుకున్నా. నేటికీ ప్రభుత్వం స్పందించడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 15 రోజులు మందుగానే ప్రభుత్వానికి, విద్యాశాఖకు సమ్మె నోటీసు అందజేశారు. స్పందించకపోవడంతో అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల వద్ద డిసెంబర్ 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. కలెక్టరేట్ల వద్ద దీక్షా శిబిరం ఏర్పాటు చేసుకుని రోజుకో విధంగా నిరసన తెలుపుతున్నారు. గురువారంతో వారి సమ్మె 24వ రోజుకు చేరింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీఆర్పీలు, కేజీబీవీ, యూఆర్ఎస్, ఎమ్మార్సీలు, భవిత సెంటర్లు, సమగ్ర శిక్షా జిల్లా విద్యా కార్యాలయంలో వివిధ హోదాల్లో పని చేస్తున్న 2,198మంది సమ్మెలో ఉన్నారు. ఫలితంగా కేజీబీవీ, యూఆర్ఎస్‌లో బోధన సాగడం లేదు. ఆయా సెంటర్లు, స్కూల్ కాంప్లెక్స్‌లో విద్యాశాఖ కార్యక్రమాల నిర్వహణ కుంటుపడడంతో అధికారులు, ఉపాధ్యాయులు అవస్థ పడుతున్నారు.

**ఇవీ డిమాండ్లు..**

- సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలి. అప్పటివరకు పే స్కేల్ అమలు చేయాలి.
- ప్రతి ఉద్యోగికీ జీవిత బీమా రూ.10లక్షలు, ఆరోగ్య బీమా రూ.10లక్షల సౌకర్యం కల్పించాలి
- సమగ్ర శిక్షా ఉద్యోగుల్లో 61 సంవత్సరాలు నిండి ఉద్యోగ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25లక్షలు ఇవ్వాలి.
- ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ ఇవ్వాలి
- సమగ్ర శిక్షా ఉద్యోగులందరికి రీ ఎంగేజ్ విధానం ఎత్తివేయాలి.



పెంచిన కూలీ రేట్లు అమలు చేయాలని మోత్కూరు సివిల్ సప్లయ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న హమాలీలు

### సివిల్ సప్లయ్ హమాలీలు...

ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ బియ్యం గోదాములలో పని చేస్తున్న హమాలీలు కూడా డిమాండ్ల సాధన కోసం ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వం యూనియన్లతో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని, రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే సివిల్ సప్లయ్ రేట్ల ఒప్పందం వెంటనే జరుపాలన్నవి వీరి ప్రధాన డిమాండ్లు. హమాలీల సమస్యలపై గత అక్టోబర్‌లో పలు దఫాల ఆందోళన అనంతరం సివిల్ సప్లయ్ అధికారులు యూనియన్ నాయకులతో చర్చించారు. ఒప్పందం ప్రకారం పెంచిన రేట్లపై నేటికీ జీఓ విడుదుల చేయలేదు. కొత్త రేట్లు అమలుకు నోచకపోవడంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు సమ్మె బాట పట్టారు. రెండు రోజులుగా నిరవధిక సమ్మె చేపడుతున్నారు. దాంతో ఎగుమతులు, దిగుమతులపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్ల పరిష్కరించాలని హమాలీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

## సమ్మె బాటలో గ్రామ పంచాయతీ కార్మికులు

తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ కార్మికులు పోరుబాట పట్టారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్నారు. గత నెల 6న జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమని ప్రకటించారు. అయినా సర్కారు స్పందించకపోవడంతో దశల వారీ ఆందోళనలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే రెండు రోజుల పాటు విధుల బహిష్కరించి టోకెన్ సమ్మె నిర్వహించారు. అయినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 4 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. 2023 జూలైలో గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేసిన సమయంలో కాంగ్రెస్ పార్టీ వారికి మద్దతు తెలుపుతూ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కానీ ఏడాది పాలన పూర్తయినా పట్టించుకోకపోవడంతో పంచాయతీ కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యారు. వీరు సమ్మెలోకి వెళ్తే గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్ల నిర్వహణ, డంపింగ్ యార్డులు, హరితహారం, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, చెత్త సేకరణ వంటి పనులన్నీ నిలిచిపోనున్నాయి. ఇప్పటికే పంచాయతీ పాలక వర్గాలు లేక పల్లెలు అస్తవ్యస్తంగా మారాయి. కార్మికుల సమ్మెతో మరింత ఇబ్బందికర పరిస్థితులు తప్పేలా లేవు.


నల్లగొండలోనీ ఎస్పీఆర్ స్కూల్ పరీక్షా కేంద్రంలో టెట్ పరీక్షను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఈఓ భిక్షపతి

# టెట్ ప్రారంభం

## తొలి రోజు 248 మంది అభ్యర్థుల హాజరు

రామగిరి, జనవరి 2 : టీచర్ ఎలిబిలిటీ టెస్ట్(టెట్)-2024 ఆన్‌లైన్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. నల్లగొండలోని ఎస్పీఆర్ స్కూల్ ఆవరణలో గల డిసిబిల్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ సర్వీస్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో ఈ నెల 20వరకు పరీక్షలు జరుగనున్నాయి. తొలి రోజు ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరుగగా 248 మంది హాజరయ్యారు. 117మంది గైర్హాజరయ్యారు. ఉదయం 180 మందికిగానూ 118మంది, మధ్యాహ్నం 185 మందికిగానూ 130మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం నిర్వాహకులు తెలిపారు. టెట్ కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. అభ్యర్థుల హాజరు తదితర అంశాలను ఆమె డీఈఓ భిక్షపతిని అడిగి తెలుసుకున్నారు. సజావుగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆమె వెంట పరీక్షల ప్రత్యేక పరిశీలకుడు, జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి ఆర్.రామచంద్రయ్య ఉన్నారు.

## రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సారికకు గోల్డ్ మెడల్


సారికకు పతకం, మెరిట్ సర్టిఫికెట్ అందిస్తున్న నిర్వాహకులు

నందికొండ, జనవరి 2 : నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీకి చెందిన ఎస్.సారిక గురువారం హైదరాబాద్‌లో జరిగిన సీఎం కప్ పారా స్పోర్ట్ మీట్‌లో భాగంగా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. డిసెంబర్ 16న నల్లగొండలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సారిక ప్రస్తుతం హిల్‌కాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది.

# కౌలు రైతులకు భరోసా దక్కేనా?

## ఆచరణలో అడుగు ముందుకు పడని కాంగ్రెస్ హామీ

**వేలాది మంది కౌలు రైతుల ఎదురుచూపు**

- **సంక్రాంతి తరువాత ఇస్తామనడంతో చిగురిస్తున్న ఆశలు**
- **సూర్యాపేట జిల్లాలో దాదాపు 67వేల మంది కౌలు రైతులు**



**అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు రైతు భరోసాపై అనేక సందేహాలు రేకెత్తుతున్నాయి. సంక్రాంతి తర్వాత రైతు భరోసా ఇస్తామంటున్న ప్రభుత్వం కౌలు రైతులపై స్పష్టత ఇవ్వకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. సూర్యాపేట జిల్లాలో దాదాపు 67వేల మంది కౌలు రైతులు 2.17 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుండగా, వారంతా సర్కారు సాయం కోసం ఎదురుచూస్తున్నారు.**

– సూర్యాపేట, జనవరి 2 (నమస్తే తెలంగాణ)

ఉమ్మడి రాష్ట్రంలో నల్లగొండ జిల్లా రైతాంగం పంటల సాగుకు పడిన వెతలు అన్నీ ఇన్నీ కావు. సాగు నీటి వసతి లేక, ప్రాజెక్టులు ఉన్నచోటా ఆయకట్టుకు సరైన వాటా దక్కక కష్టాలమయంగా ఉండేది. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో వేలాది ఎకరాలు బీడుగా దర్శనమిచ్చేవి. సాగునీటి వసతి లేక రైతు కుటుంబాలు బతుకుదెరువు కోసం వలస వెళ్లేవి. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల పరిస్థితి మరింత దారుణం. సాగునీటి వసతి లేని చోట భూగర్భంలో నీటి జాడ కూడా కరువయ్యేది. దాంతో కరువు చాయలు కొట్టొచ్చినట్లు కనిపించేవి. కొట్లాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాల్లో నిక్కచ్చి వాటాను ఎడమ కాల్వ ఆయకట్టుకు అందించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి మూసీ ప్రాజెక్టును ఆధునీకరించి కుడి, ఎడమ కాల్వల కింద ఏటా రెండు పంటలకు నీళ్లిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లోని బీడు భూములను తడిపారు. 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించారు. రైతులకు పంట పెట్టుబడి కోసం రైతు బంధు పథకానికి శ్రీకారం చుట్టి ఏటా రెండు పంటలకు ఎకరాకు రూ.5వేల చొప్పున అందించారు. ఆరేండ్లు.. పన్నెండు సీజన్లలో జిల్లా రైతాంగానికి రూ.3,200 కోట్లు పంట పెట్టుబడి సాయం అందించారు. దాంతో వ్యవసాయ పెద్ద ఎత్తున వృద్ధిలోకి వచ్చింది. పడావు పడ్డ భూములు పచ్చదనం పరుచుకున్నాయి. వలస బాట పట్టిన రైతులు సొంత ఊళ్లకు వచ్చి వ్యవసాయం చేశారు. వేలాది మంది రైతులు భూములను కౌలుకు తీసుకుని సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. దాంతో వ్యవసాయ కూలీలకూ ఉపాధి దొరికింది. కాగా, గత ఎన్నికల్లో అడ్డగోలు హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ రైతులను అన్ని విధాలుగా నిర్లక్ష్యం చేస్తున్నది. పంట రుణమాఫీ అందరికీ అందించకపోగా, రైతుబంధును రైతు భరోసాగా మార్చి ఇస్తామన్న సాయం ఊసే లేదు. ఎన్నికల ముందు యాసంగికి సంబంధించిన రైతుబంధును నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం బ్యాంకుల్లో వేసినప్పటికీ ఎన్నికల కోడ్‌తో నిలిచిపోగా, అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అవే డబ్బులను రైతుల అక్కౌంట్లలో జమ చేసింది. ఎకరాకు రూ.7,500 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్ సర్కారు ఇచ్చినట్టు రూ.5వేలను మాత్రమే అందించింది.

ఆ తర్వాత సీజన్‌కు రైతు భరోసా ఇచ్చిందే లేదు. తాజాగా మంత్రివర్గ ఉప సంఘం సంక్రాంతి తర్వాత రైతు భరోసా ఇస్తామని ప్రకటించగా, అందులో కౌలు రైతుల ప్రస్తావన లేకపోవడం వారి ఆందోళనకు గురి చేస్తున్నది. జిల్లాలో 6.12 లక్షల ఎకరాల సాగులో ఉండగా 2.71 లక్షల మంది రైతులు ఉన్నారు. అందులో సుమారు దాదాపు 67వేల మంది రైతులు 2.17 లక్షల ఎకరాలను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా. వారంతా తమకు రైతు భరోసా ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో అప్పుడే కౌలురైతులకు భరోసా అందుతుందని చెప్తున్నారు.

### కౌలు రైతులను గుర్తించి రైతు భరోసా ఇవ్వాలి

నేను నాలుగేండ్ల నుంచి మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. కౌలు రైతులకు ఎకరాకు సంవత్సరానికి 15వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టింది. అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తి అయినా నేటి వరకు అమలు చేయలేదు. ఇప్పుడు సంక్రాంతి తర్వా ఇస్తామంటున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు కౌలు రైతులను గుర్తించి రైతు భరోసా అందించాలి.

**-మామిడి వెంకటేశ్వర్లు, కౌలురైతు, అనంతారం, పెన్‌పహాడ్**

